కథా కౌముది

# బావుడి

బద్రి

ఆరుకు నుండి జయపూర్ వెళ్లే దారిలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో మేఘాలను అందుకుంటూ పచ్చని కొండల మధ్య దాక్కున్న 'పాడువా' అనే చిన్న గ్రామం. ఆ గ్రామపు చుట్టూ కొండకోనల్లో నిండుగా గిరిజన గూడేలు. ఆ గూడాల్లో ఎందరో పిల్లలు, వారిలో ఒకర్తి 'చొంపా'. అడవిలో పెరిగిన సంపంగి మొగ్గలాగా సన్నగా నాజూగ్గా, నవ్వుతూ ఎక్కడికి వెళ్లినా చెలాకీగా మాట్లాడుతూ ఉండేది చొంపా.

పగలంతా ఆటతో పాటు చింత చెట్టు దగ్గర చిగురు, కాయలు కోయటం, లేతపోతే లేత వెదురు బొంగులు కొయ్యటం, గుమ్మడి పాదు చుట్టూ తిరిగి మంచి గుమ్మడికాయ కోయడం, పొలం గట్ల దగ్గర ముళ్ల తోటకూర ఏరడం, ఇలా ఇంటికి కావలసిన కూరలు ఆకులు తెచ్చేది.

"బొవ్వా ఆకలేస్తుంది" సాయంత్రం చీకటి పడకముందే తల్లి దగ్గరకెళ్ళి అన్నం పెట్టమని మారం చెయ్యడం మొదలు పెట్టింది.

"నీకు చీకటి పడకముందే ఆకలేమిటీ?"

ప్రతిరోజూ సాయంత్రం మందు తాగి వచ్చే తండ్రి తల్లిపై చేసే అత్యాచారం చూస్తే చొంపాకి చచ్చేంత భయం. తల్లిని జుట్టు పట్టుకుని ఈడ్చి కొట్టడం, తన్నడం, నానా మాటలు అనడం. కేవలం చొంపా వాళ్ళ బాబా ఒక్కడే కాదు, ఆ గూడెంలో చాలామంది మగవాళ్ళది అదే తీరు. ఆ దెబ్బలు, ఆ అరుపులు...ఆడవాళ్లపై మగవాళ్ల ఆధిపత్యం...అదంతా ఆ గూడెం జీవితంలో ఒక భాగంలా, ఒక అలవాటులా అనిపించేది. ఎవరూ ఎదురు తిరగకపోయేసరికి, బహుశా బ్రతుకంటే ఇదేనేమో అనుకునేది.

"అయినా పగలంతా అంత ప్రేమగా ఉండే బాబా, ఆ మందు తాగితే ఎందుకలా అయిపోతాడు?" అమాయకంగా అడిగింది

ఏం సమాధాం చెప్పాలో తెలియక పళ్లెంలో ఇంత వండింది పెట్టి నోరు మూయించింది ఆవిడ. పెట్టింది తిని బుద్ధిగా తండ్రి వచ్చేలోపు గుడిసెలోకి వెళ్లి పడుకుంది.

ఇలా ఆట, భయం మధ్య ఊగుతూ సమయం గడచిపోయింది. చొంపా పదహారేళ్లు వయసు వచ్చేసరికి విరిసిన సంపంగి పువ్వులా అడవిలో పెరిగిన నల్లటి కలువల్లా, దట్టమైన నల్లని జుట్టు, పౌర్ణమి చంద్రునిలాంటి ముఖం, అందులో జింక పిల్లలాంటి పెద్దపెద్ద కళ్ళు. ఆమె అందానికి చుట్టుపక్కల యువకుల గుండెలు గల్లంతయ్యేవి.

అడవిలో పుట్టి పెరిగిన శరీరం, కొండలు, గుట్టలు, వాగులు ఇలా ఎక్కటం దిగటం ఈదటం, యౌవనంలో ఉన్నాడేమో 'డొంబురు'ది దృఢమైన నల్లని శరీరం, చూడగానే ఆకట్టుకునే మొహం, చలాకీగా ఉంటాడేమో పక్క గూడేమైనా చొంపాకి చాలా నచ్చేసాడు. డొంబురుకి కూడా చొంపా అంటే చాలా ఇష్టం.

ఇద్దరూ పక్షుల్లా స్వేచ్ఛగా అడవంతా తిరుగుతూ, వాగుల్లా గలగలా పారుతూ, గాలిలా గుసగుస లాడుతూ రోజులు గడిచిపోయేవి.

ఓ రోజు అడవిలో పూచే జాజులు కోసుకు వచ్చి మాల కట్టి చొంపా కొప్పులో పెడుతుండగా "నువ్వు మందు తాగానని మాట ఇస్తావా?" అని ముద్దుగా అడిగింది.

"చూద్దాంలే" అన్నాడు

"చూద్దాం కాదు, మాట ఇవ్వు" అంది

"సరే తాగను" అన్నాడు నవ్వుతూ

వారి ప్రేమ పెద్దల చెవిదాకా పాకింది. పెద్దలు కూడా వారి పెళ్ళికి సమ్మతం చెప్పారు.

ప్రతీ ఏడు పంటలు చేతికి వచ్చే సమయంలో ఆ చుట్టుపక్కల గూడెల యువకులంతా కలిసి వేటకు వెళ్లడం ఒక అవసరం, ఆనవాయితి. వ్యవసాయాన్ని, పంటలను రక్షించాలంటే అడవి పందులను వేటాడాలి. ఒకరోజు రాత్రి రెండు బృందాలు వేటకు బయలుదేరాయి. వాటిలో డొంబురు కూడా ఉన్నాడు.

మరుసటి ఉదయం రెండు పెద్ద అడవి పందులతో వేట బృందాలు తిరిగి వచ్చాయి. వేట విజయంలో గూడేమంతా ఉత్సవంగా మారింది. గూడెంలో జాతర అంటే మందు ఉండాల్సిందే. వేట పందులను భాగాలు వేసుకుంటున్నారు.

"మేము కొట్టిన పందే పెద్దది, చూశారా ఎన్ని ముక్కలు వచ్చాయో" అన్నాడు డొంబురు తమ బృందం వైపు గర్వాంగా చూస్తూ.

"చాల్లే, ఇలాంటి ఎలుకల్ని ఎన్ని చూసామో, ఎన్ని కొట్టామో" అని మరో బృందం యువకుడు అందుకున్నాడు.

"అవునురా, మీరు ఎలుకనే కొట్టింది. ఎంతమంది తింటార్రా దానిని" డంబురు బృందంలో వేరొకడి నోరు లేచింది.

మందు మత్తు ఎక్కుతున్న కొద్దీ మాటలు పెరిగాయి, పౌరుషాలు పెరిగాయి. అక్కడ జనమంతా రెండు భాగాలుగా చీలిపోయారు. పెద్దలు ఏం చెప్పినా ఎవ్వరి చెవులకూ ఎక్కడం లేదు.

చినికి చినికి గాలివానై, క్షణికావేశంలో ఆ కుర్రాడు చేతిలోని గొడ్డలితో డొంబురుపై ఒక్క వేటు వేశాడు. ఆ దెబ్బకు డొంబురు అక్కడికక్కడే ప్రాణం వదిలేసాడు.

ఆ ఒక్క గొడ్డలి దెబ్బ డొంబురు ప్రాణాన్ని మాత్రమే కాదు, చొంపా జీవితపు ఆశాలపైనా వేటుపడింది.

ప్రియుడి మృతదేహాన్ని చూసిన చొంపా ప్రపంచం శూన్యమైపోయింది. నెలల తరబడి గుడిసె, గూడేం దాటి బయటకు రాలేదు. ఎవరితోనూ మాట్లాడలేదు. ఎంతమంది పెళ్లి చేసుకుంటామని వచ్చినా ఆమె తిరస్కరించింది.

తన జీవితాన్ని ధ్వంసం చేసిన మద్యం పట్ల, దానిని తాగిన మనుషులన్నా ఆమెలో అసహ్యం, భయం పెరుగుతూ వచ్చాయి. ఓదార్చడానికి తల్లి కూడా లేదు. ఇక తండ్రి అమానుషానికి ఎలాంటి అవరోధం లేకుండా పోయింది.

"ఏమే ముండా పెళ్లి చేసుకోవా, నా మీద పడి ఏడుస్తూ నన్ను తినవే. నన్ను కూడా చంపేస్తే, నీకు సుఖంగా ఉంటాదా" అంటూ రోజు తాగి వచ్చి వేధించేవాడు.

పెళ్లి చేస్తే, మగపెళ్లి వారు ఇచ్చే కానుకులతో ఇంకొన్ని రోజులు తాగొచ్చు అని ఓ కోరిక ఒక పక్క. అది చేసుకోవటం లేదు అని మరీ క్రూరంగా తయారయ్యాడు. కూతురనే కనికారం లేకుండా కొట్టేవాడు, తన్నేవాడు.

ఆ హింస, ఆ నరకం భరించలేని చొంపా నిద్రలేని ఎన్ని రాత్రులు గడిపిందో. భయం, బాధ, విరక్తి అన్నీ కలిపి చావాలి అన్న కోరిక పుట్టింది, కానీ చావడానికి ధైర్యం సరిపోలేదు. ఈ నరకం నుండి బయటకు వెళ్ళాలి అని ఒక్కటే ఆలోచనతో నిద్రలేని రాత్రులన్నీ గడిపింది.

ఒకరోజు తండ్రి కొడుతుండగా మూర్ఛపోయింది, మరుసటి ఉదయం నుంచి వింతగా మారిపోయింది. కళ్ళల్లో శూన్యం, మాటల్లో అర్థం లేదు. పిలిస్తే స్పందించదు, ప్రశ్న అడిగితే వింతగా నవ్వుతుంది. భూతవైద్యులు, వైద్యులు ఎవరికీ అర్థం కాలేదు.అందరూ ఆమె తండ్రి కొట్టిన దెబ్బలకు పిచ్చిదైపోయిందని నిర్ధారించుకున్నారు. అదే చొంపాకి కావలసినది.

పిచ్చి అయితే నటించొచ్చు కానీ, పదిహేడేళ్ల అందం దాయడం కష్టం. మందు తాగే మనుషులకు పిచ్చితో పనేంటి. ఎంతమందిని చూడలేదు గూడెంలో పెళ్ళాన్ని మైకంలో కొట్టి, తన్ని, మళ్ళీ దాని పక్కకి మత్తు దిగాక దూరినోళ్ళని.

తనను తాను కాపాడుకోవాలని, క్రూర మృగాల వంటి మనుషుల నుండి రక్షించుకోవాలని ఒక వింత కవచాన్ని తయారు చేసుకుంది. నెలల తరబడి స్నానం చేయడం మానేసింది. శరీరం నుండి వచ్చే దుర్వాసన, వంటికి పట్టిన మురికి, ఒక రక్షణ కవచంగా మార్చుకుంది. అలాగే గుండెమంతా తిరిగేది. ఎవరైనా పెడితే తినేది, లేకపోతే ఏదో ఓ మూల కూర్చునేది.

విరిసి విరవకుండా సంపంగి మొగ్గలా ఉండే చొంపా ఇప్పుడు మాడిపోయి వాడిపోయి మూగబోయింది.

మనిషి మనసు చాలా వింతది. దృఢ నిశ్చయం ఉంటే ఎంత కష్టమైన పని అయినా సాధ్యమవుతుంది. పిచ్చిగా తిరిగే చొంపా గూడేం వదిలి పాడువా చేరుకుంది. అక్కడ నుండి పొట్టకు సరైన తిండి లేకుండా, కేవలం ఆశలను ఆధారంగా చేసుకుని దాదాపు డెబ్భై కిలోమీటర్లు కాలినడకన 'బోయిపరిగూడ' అనే ఊరు చేరుకుంది.

ఒక్కప్పటి చొంపా కొండల్లో వాగులా గలగలా పారేది, ఇప్పుడు సరైన తిండి లేక, పిచ్చితనం నటించి, కట్టుకోడానికి సరైన బట్ట లేక అదే వాగు పక్కన పడివున్న ఎండి పుల్లలా ఉంది. అక్కడ ఓ రెండు మూడు ఇళ్లలో పాచి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది.

ఆవిడనే అందరు "బావుడి" అని పిలుస్తారు.

బావుడి అంటే పిచ్చిది అని అర్థం.

COMMENTS